క్లుప్తంగా

ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారులు

కళ్యాణదుర్గం: యువతీ, యువకులకు ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే శ్రీధర్, కె.రవిశంకర్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై ఎన్నికల సీనియర్ సహాయకులు శ్రీనివాసులుతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటికీ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా తొలగింపులు, ఫారం-8 ద్వారా అడ్రస్ మార్పు వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి

కూడేరు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ఉదిరిపికొండ, మరుట్ల, జల్లిపల్లి, కరుట్లపల్లి గ్రామాల రైతులు కోరారు. ఆయా గ్రామాల రైతులు పని నిమిత్తం శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ (ఉరవకొండ తహసీల్దార్) అందుబాటులో లేకపోవడంతో ఆయన కోసం కార్యాలయం వద్ద పడిగాపులు కాచారు.

లడ్డూ ప్రసాద వితరణ ప్రారంభం



భక్తులకు శ్రీవారి లడ్డూను అందిస్తున్న ఈఓ, ఆలయ సిబ్బంది

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో ప్రతి శనివారం భక్తులకు అందించే ఉచిత లడ్డూ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈఓ మాట్లాడుతూ భక్తులకు నాణ్యమైన లడ్డూను ప్రతి శనివారం అందించనున్నట్లు తెలిపారు. స్వామి దర్శనానికి ప్రతి శనివారం జిల్లా నలు మూలల నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



బొజ్జన్న మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని 24వ వార్డులో గరీబ్ నగర్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ బొజ్జన్న (55) గుండెపోటు శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.. బొజ్జన్న మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, తిరుమల వెంకటేశులు, రాఘవేంద్ర, (రఘు)వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్షావలి, ఇటుకుల నాగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా కార్మికుల నిరసన



శ్రీరామరెడ్డి పంప్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక శ్రీరామరెడ్డి తాగు నీటి పథకం పంపుహౌస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు శనివారం నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ మాట్లాడుతూ, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

దురుసు ప్రవర్తనపై మున్సిపల్ ఉద్యోగి ఫిర్యాదు

రాయదుర్గంటౌన్: విధి నిర్వహణలో ఉన్న తనపై షాషున్ రాజు అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించడమే కాక వీడియో తీసి గ్రూపుల్లో పోస్ట్ చేసి తన గౌరవానికి భంగం కలిగించాడని మున్సిపల్ ఉద్యోగి మహబూబ్‌బాషా స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహబూబ్ బాషా ఇటీవల రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు. ఈక్రమంలో కార్యాలయ పని నిమిత్తం శనివారం మధ్యాహ్నం రాయదుర్గం మున్సిపాలిటీలోని పుర సేవ కార్యాలయంలో ఉండగా, వ్యక్తిగత పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన షాషున్ రాజు తనపై అసభ్యకరంగా మాట్లాడాడని, దురుసుగా ప్రవర్తించాడన్నారు. వీడియో తీసి మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేసినట్లు చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న తన గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించిన అతనిపై చర్యలు తీసుకోవాలని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రెఫరల్.. భలే ఆఫర్



» గుమ్మఘట్ట మండలానికి చెందిన మహిళకు జ్వరం వస్తుండడంతో చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి వెళ్లింది. అక్కడి ఆర్ఎంపీ ఇంజెక్షన్ ఇచ్చి, రెండురోజులకు సరిపడా మందులు, మాత్రలు ఇచ్చి పంపారు. ఫీజు మొత్తం రూ.500 తీసుకున్నాడు. మూడు రోజులైనా జ్వరం తగ్గలేదని ఆమె మళ్లీ క్లినిక్‌కు వెళ్లింది. అతను రాయదుర్గంలో రక్తపరీక్షలు చేయించుకురావాలని చీటీరాసి ఇచ్చి పంపాడు. అక్కడ రక్తపరీక్షల అనంతరం ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయి.. ఇక్కడే ఉంటే ప్రాణానికే ప్రమాదం అని బళ్లారిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. అక్కడ ఐదు రోజులు చికిత్స తీసుకోగా, మొత్తం రూ.38 వేలు బిల్లు అయ్యింది. అందులో కొంత ఆర్ఎంపీకి కమీషన్ ముట్టినట్లు సమాచారం. ఇలా కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాహకులు కొందరు ఆర్ఎంపీలకు కమీషన్ ఇచ్చి, కేసులు రాబట్టుకుంటున్నట్లు చర్చ సాగుతోంది.

- వ్యాపారంగా మారిన వైద్యం
- ఆర్ఎంపీలు, పీఎంపీలకు జోరుగా కమీషన్లు
- కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఇదే తంతు
- మెడికల్ మాఫియాపై జిల్లా కలెక్టర్ నిఘా

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రెఫరల్ దందా సాగుతోంది. వైద్యాన్ని వ్యాపరంగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీల వద్దకు వచ్చే రోగులను తీవ్రత బట్టి రెఫర్ చేయాల్సి వస్తే తమ ఆస్పత్రికే పంపాలని ఒప్పందం చేసుకుంటున్నారు. రోగి చెల్లించే మొత్తంలో కమీషన్ రూపంలో కొంత ముట్టజెపుతున్నట్టు వినికిడి.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ క్లినిక్‌లు..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రాయదుర్గం లో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండలో సీహెచ్‌సీ వైద్యశాలలు ఉన్నాయి. అర్బన్, మండలాల్లో పీహెచ్‌సీలు 30 ఉన్నాయి. వీటి ద్వారా రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అయినా గ్రామాలు, పట్టణాల్లో అదనంగా మరో 300లకు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. ఒకప్పుడు వైద్యం కేవలం ఎంబీబీఎస్, ఎండీ ఇలా ఆపై చదివిన వారు మాత్రమే క్లినిక్‌లు పెట్టుకొని రోగులకు వైద్యం చేసేవారు. పదేళ్లుగా ఇది వ్యాపారంగా మారింది. ముగ్గురు, నలుగురు కలిసి ఈ దందా కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకొని ఆస్పత్రులు నెలకొల్పుతున్నారు. ఇంకొందరైతే ఎలాంటి అనుభవం లేకున్నా ఎంబీబీఎస్ తరహా వీల్‌చైర్లు ఏర్పాటు చేసుకొని, వైద్యుల్లా చెలామణి అవుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకనే హోర్డింగులు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల బ్రహ్మసముద్రం మండలంలో ఓ ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్‌తో వైద్యం వికటించి రోగి మంచం పాలైనట్టు తెలిసింది. దీంతో అతను బాధితులు ఎక్కడ తిరగబడతారోనని పది రోజులుగా క్లినిక్ తలుపులు తెరవలేదు.

నోటీసులు ఇచ్చినా మార్పులేదు..

నిబంధనలకు విరుద్ధంగా అనుమతిలేని ఆస్పత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లపై రాయదుర్గంలో ఇటీవల జిల్లా వైద్యాధికారి ఉక్కుపాదం మోపారు. పట్టణంలోని గత నెలలో ఏడు, తాజాగా నాలుగు క్లినిక్‌లు సీజ్‌చేసి నోటీసులు జారీ చేశారు. అయినా కొందరిలో మార్పు కనిపించలేదన్న విమర్శలు ఉన్నాయి.

రెండు నెలల్లోనే 11 క్లినిక్‌లు సీజ్..

రాయదుర్గంలో గడిచిన నెలలో ఏడు, గత వారం క్రితం 4 ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి సీజ్ చేశారు. ఇది కాస్త పట్టణంలో చర్చనీయాంసంగా మారింది. ఓ వైపు తనిఖీలు నిర్వహిస్తుండగానే మరోవైపు కొందరు క్లినిక్‌ల తలుపులు మూసి వెళ్లిపోయారు. అన్ని అనుమతులుంటే ఇలా ఎందుకు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మెడికల్ మాఫియాపై జిల్లా కలెక్టర్ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందాలి..

ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందించాలి. రోగ తీవ్రతను బట్టి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలి. ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేసినట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా నిర్వహించే క్లినిక్‌లు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లపై చర్యలు తీసుకున్నాం. రెండు నెలల వ్యవధిలోనే 11 క్లినిక్‌లను సీజ్‌చేశాం. ఒకటి రెండు రోజుల్లో క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, రక్తపరీక్ష కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు, ఆర్థో, పైల్స్ ఇలా అన్ని విభాగాలకు చెందిన ఆస్పత్రుల్లోనూ తనిఖీలు నిర్వహిస్తాం. ఏ అనుభం లేని వారు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడితే క్రిమినల్ చర్యలు చేపడతాం.

– భ్రమరాంభదేవి, డీఎంహెచ్ఓ

విద్యుత్ అంతరాయంపై ప్రజల ఆగ్రహం

- కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన వైనం



కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

కణేకల్లు: పట్టణంలో విద్యుత్ అంతరాయంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రెండ్రోజుల నుంచి కరెంటు సరఫరాలేక పోతే ఎలా? అని సిబ్బందిపై ప్రజలు మండిపడ్డారు. శుక్రవారం రాత్రి భారీ వర్షంతో రాత్రంతా కరెంటు సరఫరా నిలిచిపోయింది. శనివారం విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఆరాతీయగా, అరగంటలోపు కరెంటు వస్తుంది.. అని సిబ్బంది ప్రజలను మభ్యపెట్టారు. రాత్రి అయినా విద్యుత్ సరఫరా కాకపోవడంతో ప్రజలు ఆగ్రహించి, ఒక్కసారిగా సుమారు 300 మంది విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లు ఎవ్వరూ లేరు. జేఎల్ఎంలు మాత్రమే ఉన్నారు. కరెంటు ఎప్పుడు సరఫరా చేస్తారని నిలదీశారు. సబ్‌స్టేషన్‌లో సీటీ కాలిపోయిందని, ఎల్‌బీలో సాంకేతిక సమస్య తలెత్తిందని సిబ్బంది చెప్పడంతో ఉదయం నుంచి ఎందుకు పరిష్కరించలేకపోయారని నిలదీశారు. సమస్య తీవ్రం కావడంతో పోలీసులు అక్కడికి చేరుకొని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ సరఫరా చేసేవరకూ ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తిలేదని భీష్మించారు. ఇళ్లకెళ్లి దోమలు కుట్టించుకోడం కంటే ఇక్కడే ఉంటామని ప్రజలు కార్యాలయం వద్ద బైఠాయించారు.

మూఢాచారాలను శాశ్వతంగా పారదోలుదాం

రాయదుర్గం: కుల వివక్ష, జోగిని, బసివిని లాంటి మూఢాచారాలను శాశ్వతంగా పారదోలుదామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వేచ్ఛా, సమానత్వ హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తామన్నారు. దళిత, గిరిజన మహిళలే లక్ష్యంగా ఈ దురాచారం కొనసాగిస్తున్నారన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దానప్ప, గోవిందు, జేఏసీ నాయకులు దొన తిమ్మప్ప, వన్నూర్‌స్వామి, వెంకటేశులు పాల్గొన్నారు.

రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 7న ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఆర్డీఓ (ఐఏఎస్) వినూత్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత

కంబదూరు: సీజనల్ వ్యాధులు వ్యాప్తించే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా కంబదూరు గ్రామ పంచాయతీలో పరిధిలోని గ్రామాల్లో అపరిశుభ్రతను తొలగింపజేశారు. శనివారం మండలంలోని ఒంటారెడ్డిపల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికులు మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఇళ్ల సమీపంలో ఉన్న పేడ దిబ్బలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతల స్వీకరణ

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ జయరాములు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నాగరాజు డి.హిరేహాళ్ మండలానికి బదిలీకాగా, రాయదుర్గం మండలం నుంచి రాజహంస ఇక్కడికి బదిలీపై వచ్చారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బాబు రాయదుర్గం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి బదిలీకాగా, అక్కడ పని చేస్తున్న ధనుంజయ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఉరవకొండ: అనాథ పిల్లల ఆశ్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చేస్తు వారికి నాణ్యమైన భోజనం అందించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. శనివారం పట్టణంలోని అనంతపురం బైపాస్‌లో ఉన్న ఆర్ఫాన్స్ చిన్నపిల్లల అనాథాశ్రమంతో పాటు ఆర్‌డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుద్ధిమాంద్య పిల్లల ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఈనెల 2 నుంచి 31 వరకు జరిగే స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పీడీ తోపాటు ఐసీడీఎస్ డీసీపీఓ మంజునా, బాలల సంరక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరీ తనిఖీ చేశారు. పీడీ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నపిల్లల ఆశ్రమం వద్ద అపరిశుభ్రత లేకుండా శానిటేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రాంతీయ కార్యదర్శిగా రంగారెడ్డి

ఉరవకొండ: సీపీఎం ఉరవకొండ డివిజన్ ప్రాంతీయ కార్యదర్శిగా సీనియర్ నాయకులు రంగారెడ్డి నియమితులయ్యా రు. ఈసందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

మాతా అన్నపూర్ణేశ్వరి నమోస్తుతే!



ఉరవకొండ: అన్నపూర్ణేశ్వరిగా..



కణేకల్లులో ముకాంబికాదేవి అవతారం



రాయదుర్గంలో అన్నపూర్ణదేవిగా...



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

రాయదుర్గంటౌన్/కణేకల్లు/గుమ్మఘట్ట: రాయదుర్గంలో వాసవీమాత అన్నపూర్ణేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కోట, ఓబుళాచారి రోడ్డు, శాంతినగర్, కోటలోని కంసలవీధి, నేసేపేట, హటకేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కణేకల్లులోని కనకదుర్గ ఆలయంలో శనివారం అమ్మవారు ముకాంబికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవీ ఆలయంలో సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **గుమ్మఘట్ట** మండలంలోని తాళ్లకెరలోని వీరభద్రస్వామి ఆలయంతో భద్రకాళి అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

ఉరవకొండ: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. గుంతకల్లు రోడ్డులోని జగదీశ్వరి ఆలయంలో ఆలయ ధర్మకర్త గాజుల శ్యామల, ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో ధర్మకర్త కొత్త శరత్ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.

వజ్రకరూరు: స్థానిక లలితాత్రిపుర సుందరీదేవి ఆలయం,మారెమ్మ దేవాలయంలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని శివాలయం, మారెమ్మ ఆలయాల్లో గోపుర కళశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేమకల్లు, బసాపురం అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్/కూడేరు: బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి, కూడేరు మండలంలోని బసాపురం ఆంజనేయస్వామికి శనివారం పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు.

దంచేసిన వాన

- 148.0 మి.మీ వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది
- నీట మునిగిన వరి, మిరప, మొక్కజొన్న, జొన్న పంటలు



పాల్తూరు-దర్గా హొన్నూరు రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వంక

బొమ్మనహాళ్/రాయదుర్గంటౌన్/కణేకల్లు/విడపనకల్లు/గుమ్మఘట్ట: బొమ్మనహాళ్ మండలంలో శనివారం తెల్లవారుజామున ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 148.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా వాగులు, వంకలు, వేదావతి హగరి నది పొంగి పొర్లుతున్నాయి. పంటపొలాలు, కాలనీలు, తహసీల్దార్ కార్యాలయంలోకి వరద నీరు చేరింది. ఉద్దేహాళ్ గ్రామంలోని తిమ్మలాపురం రోడ్డులోని ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరింది. వరద నీటితో డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో జనావాసాల్లోకి మురుగునీరు చేరింది. కళ్యాణదుర్గం – బళ్లారి ప్రధాన రహదారిపై డ్రైనేజీలు పొంగి, రోడ్డుపై వర్షపు నీరు చేరింది. ఉద్దేహాళ్, నేమకల్లు అంగన్‌వాడీ కేంద్రాలు, ఉద్దేహాళ్ సినిమా థియేటర్, జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోకి, బండూరులోని ఆర్డీటీ కాలనీ, మారెమ్మ ఆలయం వద్దకు నీరు చేరింది. ఉద్దేహాళ్-మల్లికేతి రహదారిపై కల్వర్టు కూలిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉద్దేహాళ్, కల్లుదేవనహళ్లి వద్ద వేదావతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉద్దేహాళ్, సిద్దరాంపురం, కురువల్లి, బొమ్మనహాళ్, ఉంతకల్లు తదితర గ్రామాల్లో సాగైన వరి, పత్తి, మిరప, జొన్న పంట పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి, నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఉద్దేహాళ్‌లోని తిమ్మలాపురం రోడ్డులో కుంటను తలపిస్తున్న దృశ్యం

రాయదుర్గంలో శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. రాత్రి 9:45 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మళ్లీ రాత్రి 11 గంటల నుంచి కుండపోత వర్షం ప్రారంభమైంది. తెల్లవారు జామువరకు ఏకధాటిగా పడింది. లోతట్టు కాలనీలైన పాత మీసేవ ఏరియా, కొలిమివీధి, రామస్వామివీధి, మధు టాకీస్ ఏరియా, సిండికేట్ బ్యాంకు వెనుక వీధుల్లో వర్షపునీరు చేరింది. 75 మిల్లీమీటర్లు (7.5 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

కణేకల్లు మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 54 ఎంఎం వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంలో మోస్తారు వర్షం కురవగా, గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి పొర్లాయి. హనకనహాళ్, సొల్లాపురం, తుంబిగనూరు, నాగేపల్లి తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి హనకనహాళ్, తుంబిగనూరు వంకల్లో వరదనీరు పొంగి ప్రవహించాయి. తుంబిగనూరులో వరి పంట నీట మునిగింది. సొల్లాపురం- ఎస్.హనుమాపురం మార్గ మధ్యంలో ఉన్న వంకలో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మఘట్ట మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. 36.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం రాకతో వాగులు, వంకలు,చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి.

పొంగి పొర్లిన వాగులు,వంకలు :

విడపనకల్లు మండలంలోని పాల్తూరు, హావళిగి, కరకముక్కల, ఉండబండ, విడపనకల్లు,పెద్ద కొట్టాలపల్లి పొలికి తదితర గ్రామాల్లో శనివారం భారీగా వర్షం పడింది. దీంతో వాగులు,వంకలు వరద నీటితో ఏరులై పారాయి. పాల్తూరు, దర్గా హొన్నూరుకు వెళ్లే మార్గంలోని పెద్ద వంక, ఉండబండ-ఉరవకొండకు వెళ్లే రహదారిలో ఉన్న వంక వరదనీటితో పోటెత్తింది. మధ్యాహ్నం వరకు రాకపోకలు బంద్ అయ్యాయి.



సిద్దరాంపురం వద్ద మిరప పంటలో చేరిన వర్షపు నీరు



తుంబిగనూరు వద్ద నీటమునిగిన వరిపంట



రాయదుర్గంలో మధు టాకీస్ వద్ద రహదారిపై నిలిచిపోయిన వర్షపునీరు

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

గుమ్మఘట్ట: మండలంలోని పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు శనివారం బాధ్యతలు చేపట్టారు. కలుగోడు పంచాయతీ కార్యదర్శి బసవరాజు రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి నుంచి ఇక్కడికి రాగా, ఇక్కడ పనిచేస్తున్న శ్వేతపద్మిని మల్లాపురానికి బదిలీ అయ్యింది. గుమ్మఘట్ట పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి రాయదుర్గం మండలం 74 ఉడేగోళం నుంచి ఇక్కడికి రాగా, ఇక్కడ పనిచేస్తున్న రాజేష్ కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యాడు. డి.కొండాపురం నుంచి భీమేష్ తాళ్లకెర పంచాయతీకి వెళ్లగా, ఇక్కడ పనిచేస్తున్న మోహన్‌కు ఇంకా స్థానం కేటాయించలేదు. మెచ్చిరి నుంచి హేమంతరాజు భూపసముద్రానికి, బేలోడు కార్యదర్శి నాగరాజు కొంతానపల్లి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో శ్రీరంగారెడ్డి బాధ్యతలు చేపట్టారు. పూలకుంట పంచాయతీ కార్యదర్శిగా కొల్లప్ప బాధ్యతలు చేపట్టారు. నాగిరెడ్డిపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పంచాయతీ కార్యదర్శిగా మల్లయ్య

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరు మేజరు పంచాయతీ కార్యదర్శిగా డి.మల్లయ్య శనివారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కార్యదర్శి శ్రీధర్‌రావు అనంతపురం మం డలానికి బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా ఆదోని మండలంలో కార్యదర్శిగా పని చేస్తున్న డి.మల్లయ్య వజ్రకరూరుకు బదిలీ అయ్యారు.

ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



రాజశేఖర్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐగా దివిటి రాజశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. డొనేకల్లు ఎక్సైజ్ సీఐగా పని చేస్తున్న ఈయన్ను ఉన్నతాధికారులు ఇక్కడికి ఇన్‌చార్జ్ సీఐగా బదిలీ చేశారు. ఆయన పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు.

వెలుగు ఏసీగా నారాయణస్వామి



నారాయణస్వామి

కళ్యాణదుర్గం: డీఆర్‌డీఏ వెలుగు కళ్యాణదుర్గం ఏరియా కోఆర్డినేటర్‌గా నారాయణ స్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో పని చేస్తున్న ఈయన బదిలీపై కళ్యాణదుర్గం వచ్చారు.

ఆర్ఐగా జి.అశ్వర్థనారాయణ



జి.అశ్వర్థనారాయణ

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా జి.అశ్వర్థ నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కణేకల్లు మండలం ఆర్ఐగా పని చేస్తున్న జి.అశ్వర్థనారాయణను వజ్రకరూరు మండలానికి బదిలీ చేశారు.

మరుట్ల వీఆర్ఓ బాధ్యతలు

కూడేరు: మరుట్ల వీఆర్ఓగా శంకర్ నారాయణను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన శనివారం వీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించారు.ఈయన గుంతకల్లు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇంత వరకూ ఇన్‌చార్జ్ వీఆర్ఓగా రామకృష్ణ పని చేసేవారు. ఆయన బదిలీ అయ్యారు.

చినుకుపడితే ఛిద్రం



నార్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇలా...

కళ్యాణదుర్గం: పట్టణంలోని రోడ్లు చిన్నపాటి వర్షం కురిసినా ఛిద్రమై, మురుగు గుంతలను తలపిస్తున్నాయి. పాతబస్టాండ్, నూర్‌ముబారక్ థియేటర్‌కు వెళ్లే రహదారి, ముదిగల్లు రోడ్డు నుంచి జయనగర్‌లోకి వెళ్లే రహదారి, ఎస్ఆర్‌పీ బిల్డింగ్ వద్ద ప్రధాన రోడ్లు నీటి మడుగులను తలపిస్తున్నాయి. జయనగర్ కాలనీ నుంచి నార్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా మారింది. స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లు బురదమయం



పాత మీసేవ వద్ద రోడ్డుపై బురద

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పాత మీసేవ ఏరియా, కొలిమివీధి, రామస్వామి వీధుల్లో రోడ్లపై బురద పేరుకుపోతుంది. ద్విచక్ర వాహనాలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురవడంతో కాలనీల్లో రోడ్లు బురదమయం అయ్యాయి.